క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల గుర్తింపు


బొబ్బిల్లంక గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీఓ

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పలు పనులు గుర్తించామని ఏపీఓ బీవీ సత్యవతి తెలిపారు. శుక్రవారం బొబ్బిల్లంకలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ఏడు కాలువ పూడికతీత పనులు, కొత్త చెరువు తవ్వకం పనులు, ఆర్అండ్‌బీ రోడ్డు ఇరువైపులా, బొబ్బిల్లంక–మిర్తిపాడు రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటే పనులు గుర్తించారు. ఇంకా పనులుంటే తీర్మానంలో ఉంచుతామని ఏపీఓ సత్యవతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి భారతి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత వ్యక్తిత్వమున్న పౌరులుగా తీర్చిదిద్దాలి

రాజానగరం: విద్యార్థులకు శారీరక మానసిక నైతిక వికాసం విజ్ఞానం అందించి సమగ్ర మూర్తిమత్వం గల పౌరులుగా తీర్చిదిద్దాలని విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. డీఎస్సీ–2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు రాష్ట్ర విద్యా శాఖ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 8 రోజుల పాటు ఇచ్చిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జీఎస్ఎల్ వైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. విలువలతో కూడిన సమాజం నిర్మించడంలో ఉపాధ్యాయులే కీలకపాత్ర వహిస్తారన్నారు. డీఈవో వాసుదేవరావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి నుంచి అభ్యసన ఫలితాలను సాధించేందుకు వ్యూహాలతో విద్యార్థులు ఆకట్టుకునేలా బోధన చేయాలని సూచించారు. వివిధ సబ్జెక్టులకు చెందిన 365 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. వీరితో ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా అన్న సమారాధన


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండలంలోని వంగలపూడి ఏటిగట్టుపై కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం వద్ద దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించి, అన్న ప్రసాదం స్వీకరించారు.

13 వరకు దరఖాస్తుల స్వీకరణ

రంగంపేట: బాణసంచా దుకాణాల వద్ద యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ కోసు అనసూయ స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె ఇక్కడ మాట్లాడుతూ, దీపావళి పండగ పురస్కరించుకుని మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలలో బాణసంచా సామగ్రి నిల్వ, విక్రయ కేంద్రాలు తప్పనిసరిగా నియమ నిబంధనలకు లోబడి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్నారు. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 13వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 14వ తేదీన వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తుదారులు అన్ని రకాల పత్రాలు, జన సంచారం లేని స్థలాల్లో బాణసంచా నిల్వ, విక్రయ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జనావాస ప్రాంతాలలో అక్రమంగా, అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినా చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

ఆహార అలవాట్లు మార్చుకోవాలి


మాట్లాడుతున్న సుందరరాజ పెరుమాళ్

రాజానగరం: ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతి ఒక్కరూ తమ ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఆరోగ్య ధాత్రి ఆయుర్వేద పరిశోధన సంస్థ (విశాఖ) డైరెక్టర్ సుందరరాజ పెరుమాళ్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్యాంపస్‌లోని గైట్ డిగ్రీ కళాశాలలో హెచ్‌బీఎస్ విభాగం ఆధ్వర్యంలో దేశీయ ఆరోగ్య పరిజ్ఞానం మహిళా వైద్యులు–సంప్రదాయ పద్ధతులు, ప్రజారోగ్య ఏకీకరణపై అధ్యయనం అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి మాట్లాడుతూ, సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్లు డాక్టర్ ఎం.సావిత్రి, ఎ.మాధవీ కామేశ్వరి, హెచ్‌ఓడీ సీహెచ్ వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- 45 రోజుల విస్తృత కార్యక్రమం


కోటి సంతకాల సేకరణ ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ శ్రేణులు

అనపర్తి: పేద, ధనిక తారతమ్యం లేకుండా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని, వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఏకకాలంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే.. ప్రైవేటీకరణ ద్వారా సీఎం చంద్రబాబునాయుడు వాటి ఫలాలను పేదలకు అందకుండా దూరం చేస్తున్నారని అనపర్తి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆరోపించారు. కూటమి ప్రభుత్వ దాష్టీకాన్ని నిరసిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ ఉద్యమ పోస్టర్‌ను శుక్రవారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రంలో ప్రజా ఉద్యమం ప్రారంభం కాబోతోందని, 45 రోజుల పాటు కొనసాగుతుందని వివరించారు. సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమంలో భాగంగా ఈరోజు నుంచి రచ్చబండ కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. పార్టీ మాత్రమే కాకుండా, పౌర సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సంతకాల సేకరణలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి మండల కన్వీనర్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు), అనపర్తి టౌన్ అధ్యక్షులు, రంగంపేట మండల పార్టీ ఇంచార్జ్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి(మురళి), బిక్కవోలు, పెదపూడి మండల కన్వీనర్లు పోతుల ప్రసాద్‌రెడ్డి(బుజ్జి), గుత్తుల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, పొలమూరు ఉప సర్పంచ్ సూరారెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు ఇమ్మంది విజయకుమారి, కోటి కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొండేటి భీమేష్, తిరగట్టి శివ, సునీల్, ఎంపీటీసీ సభ్యులు ఏడుకొండలు, ఏసు, దాసు, గోపి, ఇబ్రహీం, యాసిడ్ రాము, రవి, మేడపాటి శివశంకర్‌రెడ్డి, కొత్తూరు రామారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరో శంకుస్థాపన చేస్తే..!

- మేం పూర్తి చేయాలా అంటున్న కూటమి నేతలు
- కలవచర్ల–రాజానగరం రోడ్డు దుస్థితి
- అభివృద్ధి చేయక ప్రయాణికుల పాట్లు
- వర్షం పడితే ప్రయాణం నరకమే..


రాజానగరం–కలవచర్ల రోడ్డులో తేలిన కంకర రాళ్లు


వర్షాలకు కంకర రాళ్లు కొట్టుకుపోయి ఏర్పడిన గోతులు

రాజానగరం: పాలకులు మారినా అభివృద్ధి ఆగకూడదనేది ప్రజాస్వామ్యంలో ప్రధాన సూత్రం. రాజానగరం నియోజకవర్గంలో మాత్రం ఇది అమలు కావడం లేదు. గతంలో చేపట్టిన పనులతో మాకు ఏమాత్రం సంబంధం లేదన్నట్టుగా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు రాజానగరం జాతీయ రహదారి నుంచి కలవచర్ల మీదుగా గాదరాడకు డబుల్ లేన్లుగా విస్తరిస్తూ చేపట్టిన రోడ్డు పనులే నిదర్శనమంటున్నారు.

గత ప్రభుత్వంలో రూ.185 కోట్లు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధిక ప్రాధాన్యమిచ్చారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి రూ.185 కోట్ల నిధులు తీసుకువచ్చారు. కొన్ని ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి కాగా, మరికొన్ని చోట్ల సాంకేతిక కారణాలతో పనులు పూర్తి కాలేదు. ఇటువంటి వాటిలో రాజానగరం జాతీయ రహదారి నుంచి కలవచర్ల, సీతారామపురం మీదుగా గాదరాడకు ఉన్న రోడ్డు ఒకటి. దీనిని రూ.21 కోట్ల వ్యయంతో డబుల్ లేన్‌గా అభివృద్ధి పరుస్తూ 2023లో పనులు ప్రారంభించారు. భూసేకరణ చేసి, పనులు ప్రారంభించడంలో ఆలస్యం కావడంతో పనులు పూర్తి కావడంపై ప్రభావం చూపింది. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి కావాల్సిన ఈ రోడ్డు పనులు, ఎన్నికల నగారా మోగే సమయానికి 90 శాతం వరకు మాత్రమే జరిగాయి. ఎన్నికల తరువాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని అంతా భావించారు. ఏళ్లు దాటుతున్నా ఆ రోడ్డు వైపు చూసిన వారు లేరు.

పనులు పూర్తయ్యేనా?

జాతీయ రహదారిపై రాజానగరం జంక్షన్ నుంచి కలవచర్ల, సీతానగరం మీదుగా గాదరాడకు డబుల్ లేన్ రహదారి విస్తరణ పనులు గ్రావెల్ వర్క్స్ వరకు పూర్తయ్యాయి. తారు మిక్సింగ్ వేసే ప్రక్రియ జరగాల్సి ఉంది. ఈ పనులు జరగకపోవడంతో ప్రస్తుతం ఆ రోడ్డుపై వేసిన గ్రావెల్ లేచి, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో వీరి పాట్లు వర్ణనాతీతమే. ముఖ్యంగా వర్షాలు కురిస్తే ఈ రోడ్డుపై ప్రయాణించలేకపోతున్నారు. రోడ్డుపై పడిన గోతుల్లోకి వర్షం నీరు చేరి, ఏది రోడ్డో, ఏది గొయ్యో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో ఈ రోడ్డుపై ప్రయాణించలేక చాలామంది గండేపల్లి మండలం, మురారి మీదుగా చుట్టూ తిరిగి రాజానగరానికి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

480 మీటర్ల రోడ్డు తొలగింపు



రాజానగరం నుంచి కలవచర్ల, సీతారామపురం, గాదరాడ రోడ్డు విస్తరణ పనులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారిపై రాజానగరం నుంచి ప్రారంభమైన ఈ రోడ్డులో 480 మీటర్ల వరకు అభివృద్ధి పనులు జరగకుండా ప్రస్తుత పాలకులు తీసివేశారు. రాబోయే రోజుల్లో ఈ రోడ్డు డబుల్ లేన్‌గా అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నా కానీ, 480 మీటర్లు అభివృద్ధికి నోచుకోకుండా పాత రోడ్డుగానే మిగిలిపోతుంది.

– దాట్ల రఘు, కలవచర్ల

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే..



రాజానగరం నుంచి సీతారామపురం, కలవచర్ల మీదుగా గాదరాడకు రోడ్డు విస్తరణ పనులు చాలావరకు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. గ్రామాల్లో ప్రజల అభీష్టం మేరకు సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసి, డ్రైన్లు నిర్మించారు. గ్రావెల్ పరచిన రోడ్డుపై తారు వేయకపోవడంతో కంకర లేచి, వర్షాలకు గోతులు పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాజానగరం వెళ్లి రావాలంటే మురారి మీదుగా చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తుంది.

– మేడిశెట్టి కాపు, సీతారామపురం

శ్రీవారి విగ్రహాలకు జలాధివాసం


బలభద్రపురంలో జలాధివాసంతో స్వామి, అమ్మవార్ల విగ్రహాలు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పన్నెండు నదుల నీటితో జలాధివాసం నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నూతన నిర్మించిన శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అష్టాదశ శక్తి పీఠ సహిత పరివార దేవతా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రెండో రోజు 41 మంది దంపతులతో గణపతి పూజ, పుణ్యాహవాచనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ జరిగే విగ్రహాలకు జలాధివాసం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యుడు నల్లమల్లి రామచంద్రారెడ్డి(రాము) తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

సీతానగరం: రామచంద్రపురం వద్ద చేవల సుబ్బారావు నుంచి నగదు దొంగతనం కేసులో గోకవరానికి చెందిన మేకల రాము, నూకర్తి రాజును పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరిని కోర్టు ఆదేశాలతో వీరిని రిమాండ్ కోసం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు.

విద్యాభివృద్ధికి బోధనా పరికరాలు దోహదం

దర్శకుడు, సినీ నటుడు కాశీవిశ్వనాథ్


బోధనా పరికరాలను పరిశీలిస్తున్న కాశీవిశ్వనాథ్, స్వామినాయక్

సీతానగరం: బోధనాభ్యస పరికరాలు విద్యార్థుల అభివృద్ధికి దోహదపడతాయని సినీ దర్శకుడు, నటుడు వై.కాశీవిశ్వనాథ్ అన్నారు. శుక్రవారం పురుషోత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గోరంట్ల దాసయ్య, శేషారత్నం దంపతుల జ్ఞాపకార్థం అమెరికాలో ఉంటున్న వారి కుమారుడు గోరంట్ల వాసుబాబు బోధనా పరికరాలను పంపించారు. ఉపాధ్యాయులు చిట్టిబాబు, ఎల్ఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో హెచ్ఎం సంతోషిమాత పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సినీ నటుడు కాశీ విశ్వనాథ్, ఎంఈఓ కె.స్వామినాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ, అమెరికాలో ఉంటున్నా, తెలుగు రాష్ట్రాలపై ఉన్న అభిమానంతో ఇప్పటి వరకు 290 పాఠశాలలకు బోధనా పరికరాలు ఇచ్చి విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడుతున్న వాసుబాబు అభినందనీయుడని కొనియాడారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు బోధనా పరికరాలు ఉపయోగపడతాయని ఎంఈఓ స్వామినాయక్ చెప్పారు. అనంతరం రూ.25 వేల విలువైన బోధన పరికరాలను కాశీవిశ్వనాథ్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పొట్టియ్య, అతిథి ఉపాధ్యాయులు గుప్తా, పాపారావు, ఫణిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

15 నుంచి వృత్తి నైపుణ్య శిక్షణ


వికాస పీడీ లచ్చారావు

అనపర్తి: వికాస ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి కాకినాడ వాకలపూడిలోని డీడీయూ జీకేవై సెంటర్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల లోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు మూడు నెలలు శిక్షణ ఇచ్చి, అనంతరం ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ ఇస్తారని చెప్పారు. శిక్షణా సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్ అందిస్తారని తెలిపారు. ఆయా కోర్సులతో పాటు, అదనంగా బేసిక్ కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా 83284 83297, 89784 75164 నంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

మనోదర్పణ్‌పై అవగాహన


అనపర్తిలో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


బొబ్బిల్లంకలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అనపర్తి: ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలను శుక్రవారం పాత ఊరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నడికట్ల భ్యులాగ్రేస్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు మానసిక ఆరోగ్య ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ ఏడాది ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ థీమ్ మనోదర్పణ్‌పై అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్యం అంశంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మంచి నిద్ర, నిత్య వ్యాయామం వంటి అలవాట్ల వలన మానసిక ఆరోగ్యంపై మంచి ప్రభావం ఉంటుందన్నారు. మైండ్‌ఫుల్‌నెస్ పద్ధతుల ప్రాముఖ్యాన్ని వివరించారు.

బొబ్బిల్లంకలో..

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని హెచ్ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమంతో పాటు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు సమగ్రశిక్షా కెరియర్ గైడెన్స్ కౌన్సిలర్ సువర్ణదీప్తి ఆధ్వర్యంలో జరిగాయి. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు ఉల్లి రామకృష్ణ, సీఎస్ఆర్ మూర్తి, ఎస్ శ్రీనివాసరావు, జీఎస్ మోహన్‌రావు, ఎం పాపారత్నం, బీర సత్యనారాయణ, రత్నప్రసాద్, సింగారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో పెదపూడి క్రీడాకారుల ప్రతిభ


క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

పెదపూడి: జి.మామిడాడలో గురు, శుక్రవారాల్లో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడల్లో పెదపూడి ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చారు. అండర్–14 బాలుర విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌లో ప్రథమ, అండర్–17 వాలీబాల్, కబడ్డీలో ప్రథమ స్థానం సాధించారు. అలాగే బాలికల విభాగంలో అండర్–14 ఖో–ఖో, కబడ్డీ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. అండర్–17లో ఖో–ఖో ప్రథమ స్థానం సాధించినట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.మురళీకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థినీవిద్యార్థులను, పీడీ మురళీకుమార్‌ను పీఏసీఎస్ చైర్మన్ పుట్టా గంగాధరచౌదరి, సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధి ఆరుమిల్లి అమ్మన్నచౌదరి, ఉపాధ్యాయులు ఉదయకుమార్, డేవిడ్, వినయ్, కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు అభినందించారు.

అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలి


పాత తుంగపాడులో నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాలు

రాజానగరం: అవినీతి రహిత వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఏపీ గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అధికారి ఈదర రాంబాబు కోరారు. ఏపీ గ్రామీణ బ్యాంకు పాత తుంగపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ కూడా అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజమండ్రి ఆర్ఎం గంటా శ్రీనివాస్, హెచ్‌ఓడీ ఎం.లక్ష్మీచైతన్య, ఎం.సాగర్, బ్రాంచ్ మేనేజర్ గంటా వీర్రాజు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూల వ్యర్థాలతో అగరుబత్తుల తయారీ స్ఫూర్తిదాయకం

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి


కలెక్టర్ కీర్తి చేకూరికి అగరుబత్తులు అందజేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

కడియం: హార్టికల్చర్ వ్యర్థ పూలతో మహిళలు అగరుబత్తులు తయారు చేయడం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అభినందించారు. మహిళలు స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఆదాయ వనరులను సృష్టించడం ప్రశంసనీయమన్నారు. శుక్రవారం కడియం ప్రాంతంలోని వ్యర్థ పూలతో అగరుబత్తుల తయారీ యూనిట్, కొబ్బరి తాళ్ల తయారీ యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ పొందిన మహిళలతో సమావేశమై, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ దిశలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇదే రంగంలో మరిన్ని యూనిట్లు స్థాపించేందుకు సహకరించాలని మహిళలు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిమాండ్‌కు అనుగుణంగా యూనిట్ స్థాపన ఉండాలన్నారు. భవిష్యత్తులో ఏర్పాటు చేసే యూనిట్ల విషయంలో ముడి సరకు లభ్యత నుంచి మార్కెటింగ్ వరకు ప్రతి అంశాన్ని క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి, ఆ మేరకు కచ్చితత్వం ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళల చొరవతో కడియం నాచురల్ అగరుబత్తులు అనే ప్రత్యేక బ్రాండ్ రూపుదిద్దుకోవడం గర్వకారణమని వ్యాఖ్యానించారు. కెనరా బ్యాంక్ సహకారంతో తొలి దశలో 12 మంది మహిళలు యూనిట్ స్థాపనకు ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. మొత్తం 52 మంది మహిళలు శిక్షణ పొందగా, ఇతర మహిళలు కూడా ఇలాంటి యూనిట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పూల మార్కెట్‌ను సందర్శించి, పూల వ్యర్థాల వినియోగం, హార్టికల్చర్ ఆధారిత ఉపాధి అవకాశాల వివరాలు తెలుసుకున్నారు. పర్యాటక రంగంలో ఈ ప్రాంతంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, జిల్లా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అధికారి కె.శ్రీనివాస్, ఏపీఎంఐడీసీ పీడీ దుర్గేష్, హార్టికల్చర్ అధికారి ఎస్.మల్లికార్జునరావు, తహసీల్దార్ ఎం సునీల్‌కుమార్, ఎంపీడీవో కె.రమేష్, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నర్సరీ సందర్శన

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం కడియపులంకలోని శ్రీసత్యదేవా నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలోని ప్రత్యేకమైన వృక్షాల పెంపకం, పచ్చదన కార్యక్రమాలు, ఆధునిక పద్ధతుల్లో మొక్కల ఉత్పత్తి విధానాలను కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు నర్సరీ అధినేత పుల్లా పెద్దసత్యనారాయణ కలెక్టర్‌కు ప్రత్యేక మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, నర్సరీ నిర్వహణను ప్రశంసిస్తూ, పర్యావరణ పరిరక్షణలో ఇలాంటి ప్రయత్నాలు మరింతగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఆమె వెంట స్థానిక అధికారులు, గ్రామ ప్రముఖులు ఉన్నారు.


కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న పెద్దసత్యనారాయణ